# గీతోపదేశం

అపాయింమెంట్ ఆర్డర్ చూడగానే ఎగిరి గంతేశాడు అర్జునరావ్.

పరిగెత్తుకుంటూ వచ్చి ఒక్క ఉదుటున తండ్రి ముందు వాలాడు - మహదానందంతో తన పోస్టింగ్ ఆర్డర్స్ చూపించాడు.

ఆయన గంభీరంగా ఆర్డర్ చదివి, అర్జునరావ్‌ని దగ్గరకు తీసుకుని అతనిచేయి ప్రేమగా వత్తి, "ఆల్ ది బెస్ట్ మైసన్ - గో ఏహెడ్ టూవర్డ్స్ ఏన్ ఎక్సెలెంట్ కెరీర్" అన్నాడు.

"రేపే జాయినవుదామనుకుంటున్నాను డాడీ!" అన్నాడు అర్జునరావ్.

ఈ వార్త విన్న సావిత్రమ్మ కూడా చాల సంతోషించింది. "ఒక సంవత్సరం ఉద్యోగం లేక బలాదూర్‌గా తిరిగినా, నీ అదృష్టం బాగుంది నాయనా! ఉన్న వూళ్ళో వుద్యోగం, మంచి జీతం, రేపే చేరు" అన్నది ఆనందంగా.

"డాడ్ - కొత్తగా ఉద్యోగంలో చేరుతున్నాను. ఉద్యోగంలో ఎంతో వున్నత స్థితికి పోవాలనే ఆశతో, నా జీవితపు నిచ్చెనలో రేపు, మొదటి మెట్టు మీద నుంచోబోతున్నాను - నీ అనుభవాన్ని పురస్కరించుకుని, ఎలా మెలగాలో సలహా యిస్తే తూచా తప్పకుండా పాటిస్తాను" అన్నాడు అర్జునరావ్ వినయంగా.

డాడీ అన్నాడు - "వెల్ మై సన్ - అలా కూర్చో... నాకు తోచిన రెండు మాటలు చెబుతాను..."

అర్జునరావ్ కూర్చున్న తరువాత, ఒక రెండు నిమిషాలు నిశ్శబ్దంగా వుండి డాడీ ప్రారంభించాడు -

"నీకు తెలుసు నేను 28 ఏళ్ళ సర్వీసు చేసి రెండేళ్ల క్రితం రిటయిరయానని - నేను మా ఆఫీస్‌లో నా కొలీగ్స్ వెళ్లినంత ఎత్తులకు వెళ్లలేకపోయాను - వాళ్లు సంపాదించినంత డబ్బు సంపాదించలేకపోయాను - వాళ్ళు జీవిస్తున్నంత వైభవంగా జీవించలేక పోతున్నాను.

అయినా నాకా విషయాల్లో ఏ మాత్రం బాధ లేదు. ఎందుకో తెలుసా?'' ఆయన ఆగటంచూసి, 'ఈయనేదో పెద్ద వుపన్యాసం యివ్వబోతున్నాడల్లేవుంది' అని అనుకుని, అనవసరంగా అప్పటిదాకా నిలుచుని వున్న సావిత్రమ్మ అక్కడే కుర్చీలో చతికిల బడింది.

చతికిలబడి ''తెలిస్తే వాడు మిమ్మల్నెందుకు అడుగుతాడు?'' అన్నది భార్య హోదా చూపిస్తూ.

''అవును - తెలిస్తే అలా ఎందుకు అడుగుతాడు? చెబుతాను విను! - నేను కొన్ని ఆశయాలకు, నియమాలకు కట్టుబడి పని చేశాను. నీతీ, నిజాయితీ నా లక్ష్యం - రాజకీయం, బానిసత్వం అన్న వాటిని దూరంగా వుంచాను. బాస్‌ని బాస్‌గా గౌరవించానేకానీ, ఏ నాడూ నెత్తిన పెట్టుకోటానికి ప్రయత్నం చేయలేదు. లంచం, అక్రమ సంపాదన అన్న పదాలు నా డిక్షనరీ లోనే లేవు. నిజాన్ని నిర్భయంగా చెప్పేవాడిని. ఎక్కడ ఏ లోపంవున్నా ఎత్తి చెప్పేవాడిని. ఇలా చేయటంవల్ల కొన్ని ఇబ్బందులు కూడా వచ్చేయి. పైవాళ్లు మెచ్చేవాళ్లు కారు కదా కత్తి కట్టేవాళ్లు. శంకరగిరి మాన్యాలు తరచు చూస్తూవుండేవాడిని. చేతికి వస్తున్న డబ్బును వద్దంటున్నందుకు, నన్నో పిచ్చి వాడిగా చూసి హేళన చేశారు నా తోటి ఆఫీసర్లు. ఏది ఏమయినా నా ఆశయాల పరిధి దాటి నేను బయటకు వెళ్లలేదు. నా దేశానికి, నా ప్రజలకు నేను అన్యాయం చేయటంలేదన్న ఆత్మతృప్తి నాకు కొండంత బలాన్ని యిచ్చేది. నువ్వు కూడా ఎన్ని కష్టాలయినా, నష్టాలయినా భరించి, ఇలాగే మాట మీద, నిజాయితీ మీద నిలబడు...''

ఆయన మాటలను మధ్యలోనే తుంచి వేస్తూ అన్నది సావిత్రమ్మ - ''ఇలా అయితే వాడు, వాడి కాళ్ళ మీద నిలబడలేడు. మాటల మూటల మీదే నిలబడితే మీలాగానే నేల మీద చతికిలబడతాడు. ఎత్తులకు ఎదగలేడు. మీరు పాడయిపోయిందికాక వాడిని కూడా ఎందుకు పాడుచేస్తారు? ఆశయాలూ, అరటికాయలూ అంటూ....''

''నో - నో - నేను ఒప్పుకోను సావిత్రీ! మన పిల్లల్ని మంచిదారిలో పెట్టవలసిన బాధ్యత మనది. కష్టమైనా, నష్టమైనా నమ్మిన సిద్ధాంతాల దారిలో నడవటానికి వాడికి బలం యివ్వవలసినవాళ్లం మనం''

''అటువంటి మాటలు చెప్పకండి - అలా శాస్త్ర ప్రకారం నడచి మీరు సాధించిందేంలేదు. పైగా మిగతావారిలా జీవితంలో సుఖపడలేకపోయాం కూడాను. యింకా వాడికి కూడా ఎందుకూ సుమతీ శతకం పద్యాలు - మళ్లీ అలాటి నీతులు చెప్పారంటే ... ఉండండి - వంకాయ కూర మాడిపోతున్నది - ఒరే అర్జూ - రారా నీకో మాట చెబుతాను!'' విసవిసా వంటింట్లోకి నడిచింది సావిత్రమ్మ.

అర్జునరావ్ వాళ్లమ్మ కొంగు పట్టుకుని వంటింట్లోకి వెళ్లాడు.

''అమ్మ కొంగుపట్టుకు తిరిగే వెధవ, సిద్ధాంతాల మీద ఏం నిలబడతాడు?'' అనుకుని, సణుక్కున్నాడు డాడీ.

''డాడీ చెప్పినవన్నీ వంటబట్టాయా?'' అడిగింది వంట చేస్తున్న సావిత్రమ్మ.

''ఆఁ!'' అన్నాడు అర్జునరావ్.

మాడిపోతున్న వంకాయకూర మీద చేత్తో నీళ్లు చల్లి ఒక్కసారి 'చుయ్' మనిపించి మూత పెట్టింది సావిత్రమ్మ.

"ఒరే అర్జు! మీ నాన్న నీకు చెప్పిన ఆశయాల పాఠాల మీద కూడా యిలా ఒక గుప్పెడు నీళ్లు చల్లి, మూత పెట్టేయరా. అని ఈ కాలంలో ఎందుకూ పనికిరావు. ఈ రోజుల్లో ఉద్యోగాల్లో పైకి పోవాలంటే కావలసింది ఆశయాలు కాదు, సిద్ధాంతాలూ కాదు, నీతి నిజాయితీలు అంతకన్నాకాదు..."

"మరింకేమిటీ?" అన్నాడు అర్జునరావ్ వంకాయ కూర ఘుటు వాసనని గుండెల నిండా పీలుస్తూ.

"అది చెబుదామనే పిలిచాను. నీకు అన్నం పెడతాను కూర్చో. గబగబా తిని చిక్కడపల్లిలో సబ్బారావ్ మామయ్యా వాళ్లింటికి వెళ్లు. కిష్టిగాడు ఏప్పుడూ ఇంట్లోనే వుంటాడ్లే - పదేళ్ల క్రితం టెక్నికల్ అసిస్టెంటుగా చేరి, ఈనాడు ప్లాంటు మానేజరయాడు వాడు. వాడి ఆశయం, సిద్ధాంతం ఒకటే. నయనకానీ, భయానకానీ, జీవితంలో ఎంత త్వరగా, ఎంత పైకి పోగలిగితే, అంత దూరం వెళ్లు అని - వాడా ఆశయాన్ని అక్షరాలా పాటిస్తున్నాడు. వాడిని కలిస్తే, నీకు జీవితంలో పైకివచ్చే మార్గాలు చెబుతాడు!" అన్నది సావిత్రమ్మ.

అర్జునరావ్ ఒక క్షణం ఆలోచించాడు. బయట వరండాలో పడక్కుర్చీలో పడుకుని అంతకు ముందు రోజు పేపర్లోని రేడియో ప్రోగ్రాం వివరాలు దీక్షగా చదువుతున్న డాడీని ఒకసారి సూటిగా చూసి, "అలా అయితే తొందరగా అన్నం పెట్టు మమ్మీ" అన్నాడు.

ఆవిడ కొడుకుని ఆప్యాయంగా చూసింది. పైకి అంటే డాడీకీ ఎక్కడ వినపడుతుందో అని మనసులో, "మా నాయనే" అని కూడా అనుకున్నది.

★ ★ ★

"ఏమిట్రా - ఇలా మధ్యాహ్నం పూట ఎండలో వచ్చావ్!" అర్జునరావ్ లోపలకు రాగానే అన్నాడు సుబ్బారావు మామయ్య.

ఆయన కూడా కాళ్ల మీద నిలబడడు. ఆశయాల మీదే నిలబడతాడు. అందుకని ఏమీ ఆయనతో మాట్లాడకుండా, చకచకా లోపలి గదిలోకి వెళ్లాడు అర్జునరావ్.

ఎండాకాలం ఎండలో వచ్చాడు కదా, వినపడలేదేమో ననుకున్నాడు సుబ్బారావ్ మామయ్య. అనుకుని మొన్నటి పేపరులోని వాతావరణ విశేషాలు చదువుతూ కూర్చున్నాడు.

అప్పుడే భోజనం చేసి బెడ్ రూమ్‌లో మంచం మీద విలాసంగా పడుకుని మధ్యాహ్నమే వచ్చిన రేపటి తారీకు సాయంత్రం పేపరు చూస్తున్నాడు కృష్ణ.

"ఏం బావా ఆఫీస్‌కి శెలవా?" అడిగాడు అర్జునరావ్ వస్తూనే.

"ఏరోయ్ - నువ్వా - రారా... ఏమిటి వస్తూనే ఎండాకాలం జోక్ వేశావ్ - ఇవాళ శెలవెందుకు? ఏ పెద్దవాడయినా హరీ అన్నాడా..."

"అందుక్కాదు - నువ్వు యింట్లో వుంటేను!"

పడీపడీ నవ్వాడు కృష్ణ - "నేను రోజూ ఈ సమయంలో ఇంట్లోనే వుంటాను!"

అన్నాడు, ఫలానా సినిమా తార నేనెప్పుడూ ఈ ఫలానా సబ్బునే వాడతాను అన్నంత సహజంగా.

ప్రక్కనే వున్న కుర్చీ లాక్కుని దాంట్లో కూర్చుంటూ అన్నాడు అర్జునరావ్ -

"మా అమ్మ నిన్ను అర్జంటుగా కలవమంటేనూ - యిలా వచ్చాను".

ఒకసారి సాలోచనగా అతన్ని చూసి నవ్వాడు కృష్ణ.

"అయితే ఏదో విశేషం వుందన్నమాట" అన్నాడు.

"నాకు ఫలానా ప్రభుత్వోద్యోగం వచ్చింది!" అంటూ ఆర్డర్ కాగితం అందించాడు అర్జునరావ్.

"వెరీగుడ్ - కంగ్రాట్యులేషన్స్" అంటూ ఆర్డర్ దీక్షగా చదివాడు కృష్ణ -

చదవటం అవగానే "అయితే ఎప్పుడూ చేరుతున్నావ్?" అని అడిగాడు.

'రేపే చేరదామనుకుంటున్నాను!" అని డాడీ చెప్పిన విషయాలూ, మమ్మీ యిచ్చిన సలహా, అసలు తను ఎందుకు వచ్చినదీ వివరంగా చెప్పాడు అర్జునరావ్.

అంతావిని "గుడ్‌గాడ్ - ఎంత ప్రమాదం తప్పింది!" అని అరిచాడు కృష్ణ.

అర్జున్ ఉలిక్కిపడిలేచి "ఏమయింది?" అని అడిగాడు.

"ఏమయిందా? ప్రమాదం తప్పింది - వెనకటికెవడో తన పెళ్లికి ఆహ్వానిస్తే 'పెళ్ళికూతురు ముండదేవూరు' అని అడిగాట్ట మీ నాన్నలాటి పెద్దమనిషి. శుభమా అంటూ ఉద్యోగంలో చేరబోతుంటే, నీతి నిజాయితీ అంటూ అవేం మాటలురా - మీ డాడీ మరీ బరితెగించి పోతున్నాడు. మీ అమ్మ నిన్ను రక్షించింది కానీ లేకపోతే ఈపాటికి ఏమయిపోయివుండే వాడివి" మెత్తగా చివాట్లు వేశాడు కృష్ణ.

"అయితే మా నాన్న చెప్పిన మాటలేమీ వినవద్దంటావా?"

"చెడిపోవాలని వుంటే విను - నా కభ్యంతరంలేదు. కానీ ఒకటి మాత్రం గుర్తుంచుకో - లివ్ అండ్ లెట్ లివ్ అన్నారు. నేను ఈ పదేళ్లలో ఎంత పైకి వచ్చానో తెలుసా? నా కన్నా ముందు, నా కన్నా పెద్ద వుద్యోగాల్లో చేరినవాళ్ళు, ఇప్పుడు నా దగ్గరే పని చేస్తున్నారు. నీకు వినే వుత్సాహమూ, నేను నడిచిన పద్ధతిలో నడవాలనే కోరికా, దీక్షా వున్నాయంటే చెప్పు. నా జీవిత విజయోత్సాహపు ఫార్ములా చెబుతాను. నూటికి, నూరు పాళ్లు రిజల్టు గారంటీ.."

అర్జునరావ్ ఆలోచనలో పడ్డాడు.

కృష్ణ వెంటనే అన్నాడు - "వెనకటికి మహాకవి గురజాడ అప్పారావ్ ఏమన్నాడో తెలుసా? 'వెనకపడితే వెనకేనోయ్!' అన్నాడు. ఆయనలా అనటానికి ఇన్‌స్పిరేషన్ యిచ్చిందెవరో నీకు తెలుసా?..."

అర్జునరావ్ బేలగా చూశాడు. తల వంచుకున్నాడు.

"మీ నాన్న - మా నాన్న"

అర్జున్ తల ఎత్తి, చిరునవ్వు నవ్వాడు.

"ఇంకో విషయం చెబుతాను విను - మొన్నీమధ్య మహాకవి శ్రీ శ్రీ ఏమన్నాడో తెలుసా - 'పదండి ముందుకు - పదండి త్రోసుకు - పోదాం పోదాం పై పైకి' అని - ఆయన అలా

అనటానికి ఇన్‌స్పిరేషన్ ఇచ్చిందెవరో తెలుసా?''

"తెలుసు - నువ్వే!'' అన్నాడు అర్జునరావ్.

"సెభాష్ - దారిలో పడుతున్నావ్ - అయితే ఇంతకీ ఏం నిశ్చయించుకున్నావ్? - యింకో గురజాడ కిస్తావా యిన్‌స్పిరేషన్ - శ్రీ శ్రీ కా?''

"శ్రీ శ్రీ కే''

"గుడ్ - పైకొస్తావ్ త్వరత్వరగా - అక్కడ ఆ పుస్తకం వెనక సిగరెట్ పాకెట్ వుంది అందుకో - ఆ తలుపు కూడా వేయి. నేను సిగరెట్ త్రాగుతుండగా మా నాన్న చూస్తే బాధపడతారు'' అన్నాడు కృష్ణ.

అర్జునరావ్ నవ్వి "ఇంకా నాన్న భయమేమిటి బావా?'' అన్నాడు.

కృష్ణ సిగరెట్ వెలిగించి, గుండెల నిండా పొగపీల్చి, బయటకు వదలి, "భయం కాదురా బావా! భక్తి. భక్తి ఎంత ఎక్కువగా చూపించినవాడికి అంత ముక్తి - ఇదే నీకు నేను చెప్పదలచుకున్న మొదటి పాఠం''.

అర్జునరావ్ కుర్చీ దగ్గరకు లాక్కుని, పరీక్షలు రేపనగా అవుటయిన క్వొచ్చన్ పేపరును వింటున్నంత దీక్షగా వింటున్నాడు.

"ఉద్యోగపు వైకుంఠ పాళీలో మొదటి గడిలో, రేపు కూర్చోబోతున్నావ్ నువ్వు - అంటే రేపు ఆట ప్రారంభం అవుతుంది. పాముల్ని తప్పించుకుంటూ, నిచ్చెనలు ఎక్కుతూ, మిగతావారిని దాటుతూ ఎంత త్వరగా నువ్వు పైకి వెళగలిగితే - అంత తొందరగా జీవితంలో గెలుస్తావ్. సుఖపడతావ్. మీ నాన్నలాటి వాళ్ల ముక్కు సూటిగా వుంటుంది. అందుకని అదే డైరక్షన్‌లో పోతారు వాళ్లు. వాళ్లను అడుగడుగునా పాములు కాటేస్తాయి. నిచ్చెనలు ఎక్కటం చేతకాక, వాటిని నెత్తి మీద వేసుకుంటారు. కానీ నీ ముక్కు అంత సూటిగాలేదు కనుక నీకు ఫరవాలేదు. నేను చెప్పినట్టు విను పైకి వస్తావ్!'' అగాడు కృష్ణ.

అర్జునరావ్ "బావా ! కృష్ణా ! నువ్వు నా కన్నా వయస్సులోనూ, లోకజ్ఞానంలోనూ పెద్దవాడివి - 'నీ ఉపదేశం' వినటానికీ, విని పాటించటానికీ సిద్ధంగా వున్నాను - ప్రారంభించు'' అన్నాడు.

కృష్ణ సిగరెట్టు పొగతో, సుదర్శన చక్రంలాటి రింగును సుతారాంగా వదిలి, విలాసంగా నవ్వి, ప్రారంభించాడు -

"నాకూ ఎవరూ ఉద్యోగంలో పైకి పోవటానికి ఉపయోగపడే అభివృద్ధి సూత్రాలు నేర్పలేదు. చుట్టు ప్రక్కల వున్న మనుషుల్ని చూసి అన్నీ ఆకళింపు చేసుకున్నాను అలాగే నువ్వు కూడా నేర్చు కోవాలి. సూచనప్రాయంగా కొన్ని సలహాలను మాత్రం యిస్తాను - అవి వుపయోగించటం నీ తెలివితేటలమీద ఆధారపడి వుంటుంది'' ఒక్క క్షణం ఆగి, ఏదో ఆలోచించి మళ్లీ ప్రారంభించాడు కృష్ణ -

"ఉద్యోగపు అంతస్థుల అభివృద్ధి సూత్రాల్లో మొదటిది, ముఖ్యమైనదీ భజన చేయటం దీన్నే 'కాకా' అని కూడా అంటారు. అలాగే రెండోది 'రాజకీయాలు' చేయటం. కొన్నిసార్లు ఆత్మ రక్షణ కోసం చేయవలసి వస్తే, కొన్నిసార్లు అవతలివాడిని మింగేయటం

కోసం చేయవలసి వస్తుంది. పెద్ద చేపల బారి నించి తప్పించుకుంటూ, చిన్న చేపల్ని తినటం అన్నమాట. మూడోది 'అమ్యామ్యా...' అంటే లంచాలు తినటం. పైవాళ్లకు తెలీకుండా తినటం, వాళ్ల ప్రమేయంతోనే తినటం, తినిపించటం, తర్వాత ఆర్థికంగా బలం పెంచుకోవటం, ధన సంపాదనతోపాటు పదవులు పెంచుకోవటం. రాజ్యాలు, సామ్రాజ్యాలు నిర్మించుకుని, మకుటంలేని మహారాజు అవటానికి ప్రయత్నం చేయటం... ఇలా చాలా వున్నాయి. అవన్నీ వివరంగా చెప్పడం మొదలు పెడితే, రేపు నువ్వు వుద్యోగంలో చేరలేవు. రేపే కాదు, నెల రోజుల దాకా చేరలేవు. ఈ లోగా నీతోపాటు రేపు చేరిపోవాల్సిన ఇంకోడు, నీకు బాస్ అయిపోతాడు. కనుక ముందుగానే అన్నీ తెలుసుకోవాలంటే టైమ్‌చాలదు. నెమ్మదిగా అన్నీ తెలుసుకుందువుగాని. మిగతా కోలీగ్స్‌తో మెలగటం ఎలా? అన్నది అవసరం. అవి రేపటి నుంచే అమలులోకి తేవలసిన సూత్రాలు కనుక ముందు ఆ విషయాలు చెప్తాను! సరేనా!'

"సరే బావా - చెప్పు - రేపు పదింటికి ఆఫీసులో చేరిపోయి, సాయంత్రంలోగా ఎన్ని మెట్లెక్కగలనో చూస్తాను!" అన్నాడు అర్జునరావ్ హడావిడిగా.

"అర్జునా! మరీ అంత తొందరపడకు - ఈ ప్రభుత్వ రంగంలో పనిచేయాలంటే ప్రతి అడుగూ ఆలోచించి వేయాలి. నీకు ముందుగా ఒక చిన్న కథ చెబుతాను. పూర్వం మహా శివుడు, లోక గణాధిపత్యం వినాయకుడికి యివ్వాలా, కుమారస్వామికి ఇవ్వాలా అన్న మీమాంసలో పడ్డాడుట. చివరికి నారదుల వారి సలహా మీద ప్రపంచం అంతా ఎవరు ముందు చుట్టి వస్తే వారికి ఆ పదవి ఇస్తానని ప్రకటించాడుట. కుమారస్వామి ప్రపంచం అంతా తిరుగుతూ, ప్రతి పుణ్య క్షేత్రం దర్శిస్తూ, ప్రతి నదిలో స్నానంచేస్తూ శ్రద్ధగా, చాలా సిన్సియర్‌గా, ఫుల్ జాబ్ సాటిస్‌ఫేక్షన్‌తో, పని ముగించుకువచ్చాడుట. కానీ వినాయకుడు మాత్రం ఆ గది దాటి బయటకు వెళ్లకుండా, శివుడి చుట్టూ తిరుగుతూ భజన చేశాడుట. అప్పుడు శివుడు గణాధిపత్యం ఎవరికి యిచ్చాడో తెలుసా? సిన్సియర్ అండ్ హార్డ్ వర్కింగ్ అయిన కుమారస్వామికి కాదు. తన చుట్టూ తిరిగి శాయశక్తులా భజన చేసిన వినాయకుడికి. అంటే ఏమిటి? మన పవిత్ర పురాణాలుకూడా 'భజన' చేసి పదవులు సంపాదించండి అని చెబుతున్నాయన్నమాట. కనుక నీకు యివాళ భజనల గురించి, వాటి విశిష్టత గురించీ చెబుతాను. శ్రద్ధగా విని, నియమం తప్పకుండా ఆచరించినవాళ్లు అన్ని జన్మలలోనూ, ఎన్ని ప్రమోషన్లు కావాలంటే, అంతకు రెట్టింపు ప్రమోషన్లు తెచ్చుకుని లోక కల్యాణం చేస్తూ, వాళ్లు మాత్రం బాగా సుఖపడతారు".

అర్జునరావ్ కథ వినగానే కృష్ణ మీద చాలా గొప్ప అభిప్రాయం కలిగి వెంటనే, "బావా! నువ్వు సర్వ జ్ఞానివి. సంభవామి యుగేయుగే అన్నారు. నీకిదే నా నమస్కారం" అన్నాడు.

"ఇమ్మీడియట్‌గా ప్రమోషన్ ప్రాప్తి రస్తు" అన్నాడు కృష్ణ.

"ఆలస్యం చేస్తే అమృతం కూడా విషమవుతుందట బావా - త్వరగా చెప్పు" అన్నాడు అర్జునరావ్ అసహనంగా.

"నీ ఉద్యోగంలో అడుగడుగునా వుపయోగపడే 'భజన' సూత్రం గురించి తెలుసుకుందాం. శివుడి అంతటి వాడు భజనకు గురిఅయి, లొంగిపోయాడంటే, ఆ భజన మహాత్యం ఎంతో తెలుస్తుంది. అది గ్రహించే ఈ రోజుల్లో పైకి వద్దామనుకుంటున్న

వాళ్లందరూ, ఈ ఫార్ములానే వాడుతున్నారు. బాగుపడుతున్నారు. ఈ భజన లేక కాకా అన్నది ఎన్నాళ్ళ క్రితం పుట్టిందో చెప్పటం కష్టం. శివుడి చిన్నపటినించీ బహుశా వుండి వుండవచ్చు. భక్తుల పొగడ్తలకు ఆయన సంతోషించి వరాలిచ్చినట్టు మన పురాణాలు ఘోషిస్తున్నాయి. కనక పూర్తిగా మన దేశంలో కనుగొనబడిన 'కళగా' దీన్ని పేర్కొనవచ్చు. మన దేశంలో పుట్టినా, తర్వాత విదేశాలకు కూడా ఎగుమతి అయిన ఈ కళని - ఇంగ్లీష్‌లో బట్టరింగ్ (వెన్న పూయుట) అంటారు. మన పురాణాలలోనూ, చరిత్రలోనూ ఈ భజన గురించి ఉదాహరణలు ఎన్నో వున్నాయి. కానీ అవన్నీ వినటానికి నీకు బోరు కొట్టేయవచ్చు. అందుకని నేను చెప్పే కథలన్నిటిలోనూ వున్న 'నీతి'ని గ్రహించు. చాలు. భజన లేక కాకా అన్న ఈ ఆయుధాన్ని దేవుళ్ల దగ్గర భక్తులు, భక్తుల దగ్గర దేవుళ్లు, దేవతల దగ్గర వందిమాగధులూ, రాజుల దగ్గర భట్రాజులూ, ఆఫీసర్ల దగ్గర వుద్యోగులూ, పగటిపూట భర్తల దగ్గర భార్యాలూ, రాత్రిళ్లు భార్యల దగ్గర భర్తలూ, ఎలక్షన్ల ముందు ప్రజల దగ్గర మంత్రులు, ఎలక్షన్లు అయాక మంత్రుల దగ్గర ప్రజలూ, యిలా నానావిధములయినవాళ్లూ పాడినట్టు ఆధారాలున్నాయి. కనుక భజన చేయుటయే ధ్యేయంగా పెట్టుకుంటే, నీకు ముక్తి కలుగుతుంది - ఏదీ యింకో సిగరెట్టు వెలిగించుకోనీ!'' అన్నాడు కృష్ణ.

అర్జునరావ్ వెంటనే కృష్ణ నోటికి సిగరెట్ అందించి వెలిగించాడు.

''భేష్! నా పాఠాలు నీకు వంటబడుతున్నాయి. ఈ భజనలో చాలా రకాలు వున్నాయి. వాటి అన్నిటిలోకీ బాగా ముఖ్యమైనది పర భజన. అంటే వినాయకుడు శివుడికి చేసిన భజన అన్నమాట. ఆఫీసర్‌కి వుద్యోగి చేయవలసిన భజన అన్నమాట. అంటే నువ్వు రేపు ఆఫీసుకు వెళ్లి, జాయినింగ్ రిపోర్టు యివ్వగానే చేయవలసిన మొదటి పని అన్నమాట. ఈ పర భజన అన్నదాని విశిష్టత గురించి నీకు ఇందాక వినాయకుడి కథ చెప్పాను కదా! పురాణాలలోనే యింకో కథ కూడా చెబుతాను. ఎందుకంటే మన భారతీయుల్లో ఒక దౌర్భాగ్యం వుంది. హేతువాదంతో చెప్పేది మనకి తొందరగా ఆనదు. అదే పురాణాల మంత్ర తంత్రాల కథలతో రంగరించి యిస్తే వెంటనే చెంపలు వేసుకుని మరీ ఒప్పేసుకుంటారు. పూర్వం రాముల వారు, మిసెస్ సీతారామారావ్‌గారిని అడవిలో పారేసుకున్న కథ నీకు తెలుసు. రావణాసురుడనే ఎస్వీ రంగారావ్ ఆవిడ్ని ఎత్తుకు పోయాడు. రాముడు ప్రతి పుట్టలోనూ, చెట్టు మీదా వెదుకుతూ, కోతి అనే హనుమంతుడిని కలిశాడు. తర్వాత ఆ హనుమంతుడే 'పని' జరిపించాడనుకో. ఆ సందర్భంలో, హనుమంతుడ్ని సముద్రం దాటి లంకలోకి పదమన్నాడు రాముడు. హనుమంతుడు అంత పొడుగు ఇండియన్ ఓషన్ని దాటటానికి వెనకాడేడు. అప్పుడు రాముడు ప్లన్ మిగతా కోతులు వాడిన ఈక్వేషన్ ఏమిటో తెలుసా? పర భజన. ఈ నాడు మనం వాడుతున్న పరభజనే! అందరూ ఆంజనేయుని చూట్టూ చేరి నువ్వంతవాడివి, ఇంతవాడివి, ఎంతెంతవాడివి అని బాగా ఉబ్బేశారు ఆయన్ని. ఆ భజనతో ఎక్కడలేని శక్తి తెచ్చుకుని సముద్రం మీదనించి జామ్మని ఎగిరి కంబైన్డ్ లాంగ్ అండ్ హై జంప్‌తో ఒలింపిక్ రికార్డు పెట్టేసి, గోల్డ్ మెడల్ కొట్టేశాడు మిష్టర్ అంజనేములు. సముద్రాన్ని అలా అవలీలగా దాటించిన శక్తి మన ఫ్రెండ్ ఆంజనేయులుగారిది కాదు. అక్షరాలా ఆయనకి చేసిన భజనది. భజన అన్నది అంత శక్తివంతమైన ఆయుధం అన్నమాట. అలాగే మనం దేవుళ్లకీ, దేవతలకీ

చాల పూజలూ, స్తోత్రాలు చేస్తాం. ఆ మంత్రాల్లో ఏ ముందో ఎప్పుడయినా అర్థంచేసుకున్నావా?' అని అర్జునరావుని అడిగాడుకృష్ణ.

"లేదు. నాకు సంస్కృతం రాదుగా" అన్నాడు అర్జునరావ్.

"అక్కరలేదు. ఎవడినయినా నాలాటి వాడి నడుగు చెబుతాడు. ఆ మంత్రాన్నింటిలోనూ వుండేది ఒక్కటే. నువ్వంతటి వాడివి. సింహం నడుములాటి నడుము గలవాడివి, ఫలానా రాక్షస విలన్ని చితగొట్టినవాడివి, ఫలానా హీరోయిన్ని రక్షించినవాడివి, సత్యం కోసం నిలబడ్డవాడివి, ఒకే పెళ్ళాం కలవాడివి, నీలమేఘంలాంటి శరీరం కలవాడివి, నల్లటి జుట్టు కలవాడివి... ఇలాగే వుంటుంది. అనుమానంగా వుంటే మీ యింటికి పోగానే మీ బామ్మ పూజా మందిరంలో వున్న పుస్తకాలు చూడు. నీ ముక్కు యిలా వుంటుంది కాబట్టి మాచిపత్రం సమర్పయామి. నువ్వలాటివాడివి కాబట్టి చామంతులు సమర్పయామి. నువ్వు దశరథుడికి పుట్టావుగాబట్టి (మరి పరమాన్నం?) హారతి కర్పూరం సమర్పయామి!"

అర్జునరావ్ భయం భయంగా అన్నాడు - "బావా! శుభమా అంటూ నేను ఉద్యోగంలో చేరబోతుంటే నువ్వు దైవ దూషణ చేసి నన్నూ, నా భవిష్యత్తునూ..."

కృష్ణ పెద్దగా నవ్వాడు - "అర్జునా! నా వుద్దేశ్యం దైవ దూషణ కాదు. ఉన్నది ఉన్నట్టు చెబుతున్నాను. అంతే! మన పవిత్ర మైన మంత్రాలలో వున్న అర్థం విడమరచి చెబుతున్నాను. పొగడ్తలు ఎంత పనినయినా ఎంత దేవాధి దేవుడి చేతనయినా, ఎంత సులభంగా చేయించగలవో, నీకు సోదాహరణంగా చూపిద్దామని ఇలా మాట్లాడవలసి వచ్చింది. సరే నువ్వు ఆ టాపిక్ ఎత్తితే భయపడుతున్నావ్ కనుక ఈ రోజుల్లో భజన ఎలా వుందో చెప్పుకుందాం విను. నేను టెక్నికల్ అసిస్టెంట్‌గా చేసిన కొత్తల్లో ఒక ఆఫీసరుగారు వుండేవారు. ఆయన పేరు వెంకటరమణ. ఎవరో ఎప్పుడో అన్నారుట. మీరు చాలా హాస్యంగా మాట్లాడతారని. అప్పటినించీ ఆయన తమ మామూలు వెంకటరమణ కాదనీ, ముళ్లపూడి వెంకటరమణననీ అనుకునేవాడు. అనుకుని వూరుకుంటే బాగుండేది కానీ, కుళ్లు జోకులు దాదాపు రెండేసి నిముషాల కొకటి వేసేవాడు. మొదట్లో మొహమాటానికి నవ్వినా, మొహమాటానికి పోతే ఏదో అయిందనే సామెత గుర్తుకు తెచ్చుకుని, అందరూ గంభీరంగా ముఖం పెట్టుకునేవారు. దాంతో ఆయన చిన్నబుచ్చుకునేవాడు. అలాంటి పరిస్థితుల్లో ఆయన క్రింద పనిలో చేరాను నేను. చేరిన రెండేళ్లలో, నాకు మెరిట్ ప్రమోషన్ వచ్చింది. ఎందకో తెలుసా?"

"తెలుసు. ఆయనకు కుళ్లు జోకులకి నువ్వు నవ్వేవాడివి. అబ్బ ఏం జోకేశారు అనేవాడిని"

"మాములుగా కాదు అర్జునా! పడీ పడీ నవ్వేవాడిని. ముళ్లపూడి వెంకటరమణని మీ దగ్గర జోకులు నేర్చుకోడానికి రమ్మనమని వ్రాయనా సార్? అని అడిగేవాడిని. దాంతో ఆయన 'సోల' అయేవాడు. ఆయన జోకులకు నవ్వీ నవ్వీ ఇంటికి వచ్చేసరికి దవడలు నొప్పి పుట్టేవి. మీ అమ్మే వీలున్నప్పుడల్లా అమృతాంజనం వ్రాసేది. అయినా, అచంచల దీక్షతో నేననుకున్న మెరిట్ ప్రమోషన్ అందరికన్నా ముందుగా సాధించేను! అలా మొదలయిన

నా వైకుంఠపాళీ యాత్రలో, నిచ్చెనలు గబగబాఎక్కాను. నా స్వంత అభిప్రాయాలు, వ్యక్తిత్వం ముఖ్యంగా బేక్‌బోన్ అంటే వెన్నముకని ఏంచేశానో తెలుసా? నీ వెనకాల వుంది చూడు. గొద్రెజ్ కంపెనీవారి ఆరడుగుల అల్మైరా. దాన్లోపల భద్రంగా పెట్టి తాళం వేశాను. తాళంచెవి పెన్షన్ ఆఫీసులో ఇచ్చాను; ఆ అల్మైరా ఇప్పుడప్పుడే తెరవదలచుకోలేదు - ఈ ప్రభుత్వోద్యోగంనించి రిటైరయాక, అప్పుడే మళ్లీ వాటి అవసరం వచ్చేది. అలా చేయబట్టే, నా భజనయాత్ర నిరాఘాటంగా సాగింది. మా బాస్‌లకు సినిమాలకు టికెట్లుకొని లోపల కూర్చోబెట్టి, ఇంటర్వేల్‌లో గోల్డ్‌స్పాట్‌లు కూడా కొట్టించాను. ఆయన దోసకాయ పచ్చడి బాగుండదు అంటే బాగుండదు అనటం - బాగుంటుంది అంటే బాగుంటుంది అనటం - మారిలెన్ మన్రో క్రికెట్ బాగా ఆడతాడు కదూ అంటే, ఎస్సార్ ఆరు సార్లు సెంచరీలు కూడా కొట్టాడు అనటం - బ్రూస్‌లీపాటలు బాగా పాడుతుందికదూ అంటే, అవున్సార్ బాగా పాడుతుంది అనటం - ఆయన ఏమన్నా సరే, ఎస్సార్, ఎస్సార్, ఎస్సార్, ఎస్సార్, ఎస్సార్, ఎస్సార్, ఎస్సార్, ఎస్సార్ - దట్సాల్ - నీ యాత్ర విజయయాత్ర. ఢోకాలేదు. ఎక్కడా ఆగేపనిలేదు. భూగోళం చుట్టూ శాటిలైటు తిరిగినట్టూ, బాస్ చుట్టూ తిరగడమే. చివరి ఆర్బిట్ నించి, లోపలి ఆర్బిట్‌కి, యింకా లోపలి ఆర్బిట్‌కి అలా పోతూనే వుంటావు. నీ భజనకు మెచ్చి, నీ మీద 'ఆకర్షణ' పెరిగి, తన న్యూక్లియస్‌లోకి ఠక్కున లాగేసుకుంటాడు బాస్. తర్వాత నీ జీవితం, జీతం, వెండితెరమీద (అంటే సిల్వర్‌స్కీన్ మీద) చూసుకోవలసిందే! అన్నట్టు నీకు కుక్కకీ, పిల్లికీ తేడా తెలుసా?'' సడన్‌గా అడిగాడు కృష్ణ.

''ఇదేమిటి బావా! మధ్యలో ఈ జంతువుల పిట్టకథలెందుకు?'' విసుక్కున్నాడు అర్జునరావ్.

''అనవసరం వుందిరా అర్జునా! అందుకే అడిగాడు. కుక్కకీ, పిల్లికీ ఒక ముఖ్యమైన తేడా వుంది. నువ్వు ఒక్క కుక్కను పెంచుకుంటున్నావనుకో - అది నీ చుట్టూరా తిరుగుతుంది. నువ్వు ఒక రోజున, దానికి తెలీకుండా ఇల్లు మారి యింకోచోటుకి వెళ్ళావనుకో - అది వాసన పసిగట్టి ఎలాగోలా నీ యింటికి చేరుతుంది. కానీ పిల్లి ఏంచేస్తుందో తెలుసా? నువ్వు ఆ ఇల్లు మారి వెళ్లావనుకో, అది నీతో రాదు. అది ఆ ఇంట్లోనే వుంటుంది. ఆ ఇంట్లోకి వచ్చిన కొత్తవాళ్లకి అది దగ్గరవుతుంది. దాన్ని తీసుకెళ్లి అవతల సందులో వదిలిపెట్టినా, అది మళ్లీ ఆ ఇంటికే వస్తుంది. అంటే ఏమిటన్న మాట - కుక్క ఎప్పుడూ తన మాష్టర్‌నే అంటిపెట్టుకుని వుంటుంది. అతను ఎక్కడికి వెడితే అక్కడకు వెడుతుంది. కానీ పిల్లి ఒక ప్రదేశాన్ని నమ్ముకుంటుంది. అక్కడికి ఎవరువస్తే వాళ్లకు దగ్గరవుతుంది. ఈ రెండు జంతువులూ, మనకి రెండు రకాల నీతులు భోధిస్తున్నాయి!''

''నా కంతా అర్థం అయిందిలే బావా - కానీ మరీ అలా మనుషుల్ని, కుక్కల్తో పోల్చకు...''

''ఒరే అర్జునా - చెంపలేసుకో ముందు. అలా అనకూడదు. కుక్క చాల విశ్వాసం గల జంతువు. సమయం వచ్చింది కాబట్టి ఇవన్నీ చెబుతున్నాను. ఇంకోవిషయం - మా ఆఫీసులో నాదస్వామి అనే ఒక అరవ్వాడు వుండేవాడు. పరభజన అతని జీవిత పరమార్థం.

మామూలుగా పెళ్ళాం పిల్లల్తో మాట్లాడే దగ్గరనుంచి, అతనిలో పరభజన కనిపిస్తుంటుంది. అంటే పరభజనని అతను 'వే ఆఫ్ లైఫ్'గా తీసుకున్నాడన్నమాట. ఉదాహరణ కూడా చెబుతాను. నా రూమ్ లోకి వస్తాడు. గుడ్‌మార్నింగ్ సార్ - బాగున్నారా అని ప్రారంభిస్తాడు. అమ్మగారు కులాసాగా వున్నారా, మీరు ఆ యింట్లోనే వుంటున్నారా, ఇంటాయన ఆరోగ్యం బాగుందా, మీ తమ్ముడుగారు అదే స్కూలుకి వెడుతున్నారా - ఇలా బాగోగులుఅన్నీ అడిగి, అప్పుడు అడుగుతాడు - ఒక గుండుసూది యివ్వండిసార్ అనో, ఒక జెమ్‌క్లిప్ కావాలి అనో. చిన్న పామునయినా పెద్ద కర్రతో కొట్టాలి అనే సిద్ధాంతం అయనది. దాన్నే నమ్ముకుని, పరభజనతో, పైకి వస్తున్నాడు. స్వామి పరభజనకి నిర్వచనం... కాదు ట్రేడ్‌మార్క్ ఏమిటో చెప్పనా''

''చెప్పు!''

''అక్కడ 'భజన చేయండీ భక్తులారా' అనే పాట రికార్డు వుంది - అందుకో!'' అన్నాడు కృష్ణ.

''దానిమీద బొమ్మ చూడు - ఆ కుక్క ఎలా బుద్ధిగా కూర్చుందో - హిస్‌మాస్టర్స్ వాయిస్ అని దానర్థం - అదే పరభజనకి పరమార్థం'' అపాడు కృష్ణ.

సాలోచనగా తల వూపాడు అర్జునరావ్.

''వంటింట్లోకివెళ్ళి, మా అమ్మ రెండు కప్పుల కాఫీ యిస్తుంది తీసుకురా!'' అన్నాడు సిగిరెట్ పెట్టి దిండు క్రింద దాచిపెడుతూ కృష్ణ.

అర్జున్ రెండు చేతుల్తో కాఫీ తీసుకు వస్తుండగా, నాలుగు వారాల క్రితం నాటి వారపత్రికలో వారఫలాలు చదువుతున్న సుబ్బారావ్ మామయ్య అడిగాడు, ''ఏమిట్రా గదిలో చర్చలు చేస్తున్నారు?'' అని.

''ఏంలేదు. వచ్చేవారం శని ఏ గదిలో వుంటాడో చెబుతున్నాడు బావ''.

''సరే వీడు అది కూడా మొదలు పెట్టాడూ!'' సణుగుతున్నాడు ఆయన.

కాఫీ బల్ల మీదపెట్టి, తలుపు దగ్గరగా వేసి, దిండుక్రింద నించీ సిగరెట్టు పెట్టి తీసి కృష్ణ ముందు పడేశాడు అర్జున్.

''థేంక్యూ! ఇందాకటినించీ పరభజన గురించి కదూ నీకు చెప్పాను. దీనితర్వాత మనం తెలుసుకోవలసినది స్వంతభజన గురించి'' కాఫీ త్రాగుతూ అన్నాడు కృష్ణ.

''స్వంత భజన అంటే మనమే...''

''ఆఁ అదేనోయ్ చవలాయ్! స్వంతడబ్బా కొట్టుకోవటం అన్నమాట. టాటాలు, బిర్లాలూ మంచి సబ్బులూ, పౌడర్లే తయారుచేస్తున్నారు. అలా అని చేతులు ముడుచుకుని కూర్చుంటున్నారా? పేపర్లలో, రేడియోలలో, సినిమాలలో పబ్లిసిటీ దంచేయటంలేదూ. ఎందుకంటావ్? అడ్వర్టయిజ్‌మెంట్ అవసరం కనుక. వాళ్ల సంగతి, వాళ్లే చెప్పుకోకపోతే, అందరికీ ఎలా తెలుస్తుంది? అందుకని బాకా వాయించేస్తారు. ఎంత బాగా బాకా వాయించేస్తారంటే, వాళ్లు కుక్క సబ్బులు చేసి అమ్మినా సరే, ఫలానా సినిమాతార ఆ సబ్బు వాడతానని చెబుతుంది. కనుక, ప్రజలు వెర్రివాళ్లులాగా అదే కొనేస్తారు. అంటే ఏమిటి?

ఎంత డబ్బా కొట్టుకుంటే అంత అభివృద్ధి అన్నమాట. దీన్నే నేను స్వంత భజన అన్నది. పరభజన ఎన్ని ఫలితాలను ఇస్తుందో, ఇది కూడా అలాగే గ్యారంటీగా ఫలితాలను యిస్తుంది. అదిసరే కానీ మీ నాన్న నీకు పెళ్లి చేస్తానంటున్నాడా?'' సిగరెట్టు వెలిగిస్తూ అడిగాడు కృష్ణ.

సిగ్గుపడ్డాడు అర్జున్ - ''ఇప్పుడెందుకు బావా అలాటివన్నీ. ముందు ఉద్యోగంలో కొంచెం పైకి రానీ...''

''అదేమిటి బావా? అలా సిగ్గుపడిపోతున్నావ్. ప్రమోషన్లు రాకుండా ఎలా వుంటాయి... అసలు నేనీ విషయం ఎందుకు చెబుతున్నానంటే...రేపు... రేపంటే రేపే కాదనుకో... ఎల్లుండి నీకు పెళ్లవుతుంది. నువ్వూ మీ ఆవిడా ఝుమ్మని హనీమూన్ కొట్టేస్తారు. హనీమూన్ నించి వచ్చేటప్పుడు మీతోపాటు ఒక బేబీని కూడా తెచ్చేస్తారు''.

''బేబీనా... ఎవరి బేబీని...'' కంగారుగా అడిగాడు అర్జున్.

పెద్దగా నవ్వాడు కృష్ణ - ''అంత గాభరా పడతావేమోయ్ అర్జునా ! మీ బేబీనే... హనీమూన్ వెళ్లినప్పుడు మరి వూరికే కూర్చోవుకదా... అలాటప్పుడు...''

మళ్లీ సిగ్గుపడి ''ఛీ! ఫో'' అన్నాడు అర్జునరావ్.

''ఓరినీ... నీ సిగ్గు బంగారం కానూ... మీ బేబీ ఉయ్యాల్లో పడుకునుంటుంది. దానికి ఆకలివేస్తుంది. పాలు కావాలి మరి. అప్పుడు మీకు ఆ బేబీ అవసరం ఎలా తెలుస్తుంది?'' అడిగాడు కృష్ణ.

''అవును ఎలా తెలుస్తుంది?'' ఆలోచిస్తూ అన్నాడు అర్జునరావ్.

''వట్టి సన్నాసివిరా బావా నువ్వు. బొత్తిగా అనుభవంలేదు'' నవ్వుతూనే విసుకున్నాడు కృష్ణ.

''పెళ్లి కానివాడిని. నాకలాటి అనుభవం ఎలా వుంటుంది బావా?'' అమాయకంగా అన్నాడు అర్జున్.

పెద్దగా నవ్వి అన్నాడు కృష్ణ - ''చుట్టూ సరిగ్గా పరిశీలిస్తే అదే వస్తుంది అనుభవం. ఆకలి వేసిన ఆ పాప ఏం చేస్తుందో తెలుసా? ఏడుస్తుంది. ఏ భాషా రాకపోయినా 'కేర్' మని ఏడుస్తుంది. అంటే అర్థం ఏమిటో తెలుసా? నన్ను కేర్ చేయండి అని - నన్ను కనిపెట్టి వుండండి, నన్ను గుర్తించండి అని. నాకు పాలు కావాలి అని - నాకు ప్రమోషన్ కావాలి అని - నాకు పదవులు కావాలి అని - 'క్రైయింగ్ బేబీ ఓన్లీ గెట్స్ మిల్క్' అని ఇంగ్లీష్‌లో ఒక సామెత కూడా వుంది - దాన్ని తెలుగులో తర్జుమా చేస్తే 'నీ ఏడుపేదో నువ్వే ఏడవాలి' అని అర్థం. ఏడిస్తేకానీ పిల్ల తల్లికే తెలీదు, ఆ పిల్లకేదో కావాలని. ఇక ఆఫీసర్ గాడికేం తెలుస్తుంది మనకేం కావాలో - అందుకని మనం మన ఏడుపేదో గట్టిగా ఏడుస్తేనే కానీ మనని ఎవరూ గుర్తించరు. పిల్లల విషయంలో ఏడుపు అంటాం, స్వంతభజన అన్నదాన్ని సమయానికి చేయకపోతే మిగిలేది ఆ ఏడుపే'' ఇంకో సిగరెట్ వెలిగించాడు కృష్ణ.

అర్జున్ ముఖంమీద గుప్పుమని పొగ వదిలి చెప్పటం సాగించాడు కృష్ణ - ''ఈ స్వంత

భజన కూడా రెండు రకాలు. ఒక్కొక్కప్పుడు మన గురించి మనమే వాయించేసుకుంటాం. అప్పుడప్పుడూ సందర్భాన్నిబట్టి ఇంకెవరితో నయినా స్వంతభజన చేయించుకుంటాం. నేను ఈ రెండు టెక్నిక్స్ బాగానే వాడాను. ఇంకొకళ్లచేత స్వంతభజన ఎలా చేయించుకోవటమా? అని కన్‌ఫ్యూజ్ అవకు -ఒక ఉదాహరణ యిస్తాను. ఎన్నికలలో నాయకుడు ఏం చేస్తాడు? తన గురించి చెప్పదలచుకున్నదంతా ఊకదంపుడుగా డబ్బా వాయించేస్తాడు. అది మొదటి రకం స్వంతభజన. తర్వాత ప్రఖ్యాత సినిమా తారలూ, ఆ వూళ్లోని కిరాణా నాయకులు, తతిమ్మా కిరాయి పెద్దలూ వచ్చి ఆ నాయకుడి గుణగణాలను ఏకధాటిగా చెబుతారు. అంటె నాయకుడు అలా వాళ్లకి ఏదో - తాయిలం - ఆశ చూసి వాళ్ల ద్వారా స్వంతభజన చేయించుకుంటాడు. దాంతో వెర్రి ప్రజలు డంగయి పోతారు. సో - ఈ రెండు టెక్నిక్స్ సమయోచితంగా వాడటం నేర్చుకుంటే ఊహించలేనంత తొందరగా ఎదుగుతావు! నేను చెప్పినవన్నీ అర్థం అవుతున్నాయా!'' అడిగాడు కృష్ణ.

''అర్థం కాకపోవటమేమిటి బావా! - నేనేమన్నా వాజమ్మననుకున్నావా - నాకు తెలివి తేటలు వున్నాయి - చదువుకున్నాను. ఏం చెప్పినా యిట్టే పట్టేయగలను...''

''అర్జునా - నీ స్వంతభజన ఆపు - నే చెప్పింది నీ కర్థం అయిందని నా కర్థం అయింది. వంటింట్లో నించి పకోడీల వాసన వస్తున్నది - ఒక ప్లేటు నిండా తేకూడదూ - తింటూ మాట్లాడుకుందాం!''

అర్జునరావ్ లేచి వెళ్లాడు.

పెద్ద ప్లేటునిండా పకోడిలతో వస్తున్న అర్జునరావ్‌ని చూసి అన్నాడు సుబ్బారావ్ మామయ్య - ''ఏమిట్రా - ఎండ విరగకాస్తుంటే చినుకులు పడుతున్నాయి అంటాడు రేడియోలో వాతావరణం చెప్పేవాడు!''

''అవును మామయ్యా - ఇందాక కూడా రేడియాలో చెప్పాడు - పగలు వెలుతురు గానూ, రాత్రి చీకటిగా వుంటుందని...''

ఆయన సణుగుడు వినపడకుండా తలుపు వేసి, పకోడీల ప్లేటు మంచం మీద పెట్టాడు అర్జునరావ్.

''సెభాష్ - అర్జునా - నువ్వు కూడా కానీయి...'' పకోడీలు నములుతూ ఏదో ఆలోచించాడు కృష్ణ.

తల ఎత్తి అన్నాడు - ''నీకు ఈ భజన కథలలో రెండురకాల భజనల గురించి చెప్పాను. మూడోదీ, చాల ముఖ్యమైనదీ యింకోటి వుంది - అది చాల జాగ్రత్తగా చేయవలసిన భజన - ఏమాత్రం అజాగ్రత్తగా వున్నా బెడిసికొడుతుంది - దాని పేరు పరస్పర భజన!''

పకోడీని నోట్లో వేసుకోబోతున్న అర్జునరావ్ నోరు తెరచి, అలాగే ఆగిపోయాడు.

''ఆ పకోడీని నోట్లో వేసేసుకో - అలా నోరు తెరిస్తే నాకు బాగుండదు - మా ఆఫీసుల్లో ఇద్దరు వుండేవారు మూర్తిగారూ, రావుగారూ అని. ఇద్దరూ ఇంజనీర్లే. ఆయన గురించి

ఈయనా ఈయన గురించి ఆయనా డబ్బా వాయించేస్తువుంటారు. ఇద్దరూ జంటగా పైకివచ్చేవారు. కేటూ, డూప్లికేటూ అంటారే, అలా! దీంట్లో, ఒక తిరకాసు వుంది. నీ పార్టనర్ నిన్ను ఏదో ఒక స్టేజిలో మింగేసే అవకాశం వుంది. నువ్వేమో వాడి గురించి గొప్పలు చెబుతూ వుంటావు యిడియట్ లాగా. ఈలోగా వాడేమో నీ కోసం ఒక గొయ్యి తవ్వేసి, తడిగుడ్డ రెడీగా వుంచుకుంటాడు. దాంతో గొంతు కోసేయటానికి. అందుకే ముందుగా చెప్పాను. ఇది చాలా జాగ్రత్తగా చేయవలసిన భజన అని. 'నీకు నేను డబ్బా వాయిస్తాను - నాకు నువ్వు డబ్బా వాయించు' అనే ఒప్పందం మీద నడిచే పద్ధతి అన్నమాట ఇది. ఒక దేవుడయ్యగారో, దేవుడమ్మగారో వుంటారు. ఆయన/ఆవిడ మహత్యాలు చాటవలసినవారు భక్తుల రూపంలో వుండే ఏజంట్లు. ఆ భక్తుల నిస్వార్థ సేవనీ, భక్తినీ చాటిచెప్పే దేవుడయ్య(మ్మ) గారు. ఫలితం ఏమిటంటే వేల సంఖ్యలో భక్తుల సంఖ్య పెరగటం - వ్యాపారాభివృద్ధి - లాభాలూ - కావలసినంత డబ్బు. ఇది ఒక చిన్న ఉదాహరణ మాత్రమే. నీ దగ్గరకు ఎవరయినా వచ్చి భజన మొదలు పెట్టాడనుకో. ఆలోచించు, వాడు నీకు ఉపయోగపడతాడా అని. ఉపయోగపడేట్లయితే ప్రారంభించు పరస్పర భజన. వాడికి నువ్వు ఉపయోగపడు. వాడిని ఉపయోగించుకో. వాడు నీకు ఉపయోగ పడడనుకో, అప్పుడేం చేస్తావ్?''

అర్జునరావ్ పకోడీ నోట్లో వేసుకుని నమలకుండా మింగేశాడు.

''దట్సాల్ అలాగే మింగేశెయ్! మళ్లీ యింకోడెవడూ నిన్ను ఉపయోగించుకుందామని ఆలోచించడు''.

ప్రక్కనున్న కూజాలో నీళ్లు, గ్లాసులో ఒంపుకుని గటగటా త్రాగేశాడు అర్జునరావ్.

''బావా! ప్రస్తుతానికి ఈ టిప్స్ చాలనుకుంటాను. నే చెప్పినవన్నీ గుర్తుంచుకుని శ్రద్ధగా పాటించు, పైకొస్తావ్. ఆఫీసుల్లో రాజకీయాల గురించీ, లంచాలు తినటంలో మెళకువలు గురించీ నెమ్మదిగా తెలుసు కొందువుగానిలే. ఈలోగా ఈ భజన మాత్రలు వాడు - ఎంతటివాడి రోగమయినా సరే ఇట్టే కుదురుతుంది. రోగం కుదరకుండా ముదిరితే ఎంత రాత్రయినా సరే నా దగ్గరకు రా మందిస్తాను...'' సాయం సంధ్యవేళ ఆవలిస్తూ అన్నాడు కృష్ణ.

అర్జునరావ్ కృష్ణ చేయి పట్టుకుని ప్రేమగా వత్తాడు.

''పోయిరా అర్జునా? చీకటి పడేలోగా కొంపకు చేరు!'' పడుకుని మళ్లీ ఆవలించాడు కృష్ణ.

అర్జునరావ్ కృష్ణను భక్తితో చూసి బయటకు వచ్చాడు.

సుబ్బారావ్ మామయ్య ఆంజనేయ దండకం చదువుతున్నాడు - 'శ్రీఆంజనేయం ప్రసన్నాంజనేయం ప్రభాదివ్యకాయం...'' అంటూ.

సాయంత్రం పూట రోజూ ఆయన అలవాటుగా ఆంజనేయ దండకం చదువుతాడు. రాత్రిళ్లు వాళ్లింటికి దయ్యాలు రాకుండా కాపాడమని, శ్రీ ఆంజనేయస్వామి వారికి ఆయన చేసే 'భజన' అది.

*